నీటి ఎద్దడిపై మహిళల నిరసన

శామీర్‌పేట్: లాల్‌గడి మలక్‌పేటలో నీటి ఎద్దడిని నిరసిస్తూ మహిళలు ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్మికుల సమ్మె కారణంగా నీళ్లు వదలకపోవడంతో మూడ్రోజుల నుంచి గ్రామంలో నీళ్లు రావడం లేదని వాపోయారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలియాబాద్ గ్రామంలో కూడా నీళ్లు రాకపోవడంతో ప్రజలు ఆందోళన దిగారు.

భూ సేకరణకు అధికారుల సర్వే



ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో బునాదిగాని కాల్వ నిర్మాణం కోసం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గురువారం భూసర్వే చేపట్టారు. బీబీనగర్ మక్త అనంతారం నుంచి అడ్డగూడూరు వరకు నిర్వహించనున్న బునాదిగాని కాల్వ ఏదులాబాద్ రెవెన్యూ పరిధిలో రెండు కిలోమీటర్లు ప్రవహించనుంది. కాల్వ కోసం అడ్డంగా 42 మీటర్లతో సుమారు 30 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. కాల్వ నిర్మాణంతో సాగునీరు అందుబాటులోకి వస్తుందని, భూసర్వేకు రైతులు అందరూ సహకరించాలని కోరారు. ఆర్. కావ్యరెడ్డి, ఇరిగేషన్ ఏఈ భరత్‌కుమార్, రైతులు శ్రీశైలంయాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే వ్యాధి నివారణ

జవహర్‌నగర్: పౌష్టికాహారంతోనే క్షయవాధిని నివారించవచ్చని జవహర్‌నగర్ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సుష్మ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ‘ప్లాన్ ఇండియా’ స్వచ్ఛంద సంస్థ సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవగాహనతోనే క్షయను నివారించవచ్చని, వ్యాధి భారిన పడిన వ్యక్తులకు సరైన చికిత్స అందించకుంటే కుటుంబంలో ఇతరులకు సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, టీబీ సూపర్‌వైజర్ ఫాతిమా, సిబ్బంది జైహింద్, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టి కార్మికుడి మృతి

శామీర్‌పేట్: ఇటుకబట్టిలో పనిచేసే కార్మికుడు మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన కుషా పహారియా (38), శామీర్‌పేట మండలం, అలియాబాద్‌లోని ఎస్‌వీసీఈవీసీ ఇటుక బట్టీలో గత కొంత కాలంగా కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటలకు భోజనం ముగించుకుని 12 గంటల ప్రాంతంలో ఇటుక బట్టీలు కాల్చడానికి సిద్ధంగా ఉన్న బట్టి పైన పడుకున్నాడు. ఉదయం ఐదు గంటలకు అతడు పనిలోకి రావాల్సి ఉండగా రాకపోవడంతో తోటి కార్మికుడు గోవర్ధన్ ఫోన్ చేయగా స్పందించ లేదు. దీంతో ఇటుక బట్టీ మీదకు వెళ్లి చూడగా స్పృహ తప్పి పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వడదెబ్బ తగిలి మృతి చెందాడా.. ఇతర అనారోగ్య కారణాలేమైనా.. ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

మేడ్చల్: అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి గదిలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శ్రీహనీష్ (22) నివాసం ఉంటూ.. 45 రోజులుగా ఎలివేషన్ పనులు చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కార్మికుడు మృతి చెందినట్లు యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించింది. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలే నిజమైంది..!

ఇంట్లో బంగారం, వెండితో పాటు నగదు చోరీ

జవహర్‌నగర్: మనుషులకు కలలు పడటం సహజమే కానీ తన ఇంట్లో దొంగలు పడి అది నిజం కావడాన్ని ఎవరూ ఊహించరు. అలాంటి ఘటనే దమ్మాయిగూడలోని వీఎన్ఎస్ హోమ్స్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఎన్ఎస్ హోమ్స్‌లో నివాసం ఉండే కృష్ణంరాజు మిర్యాల, సౌజన్య ఇద్దరు పిల్లలతో కలిసి ఢిల్లీలో ఉంటున్నారు. సౌజన్య తల్లి పద్మ వీరి ఇంట్లోనే ఉంటూ తరచూ ఊరికెళ్లి వస్తుంటుంది. ఈనెల 8న సౌజన్య భర్త కృష్ణంరాజు వద్దకు వెళ్లింది. సౌజన్యకు ఇటీవల దమ్మాయిగూడలోని ఇంట్లో దొంగలు పడ్డారని కల వచ్చిందని, నిజమే కావొచ్చని కాలనీ ప్రెసిడెంట్‌కు ఫోన్ చెప్పడంతో వెళ్లి చూడగా.. నిజంగానే దొంగతనం జరిగిందని తెలిపారు. వెంటనే కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ ఆధారంగా వివరాలు సేకరించారు. 4 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ. 20 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ భారతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి, నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భూభారతి ఆర్‌ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు.

◆ 1989 ఆర్‌ఓఆర్ చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు సిమిలర్గా ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయని, ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

◆ ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలన్నారు.

◆ నూతన మార్గదర్శకాలతో సమ్మతించడం, తిరస్కరించడం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు.

◆ ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వేచేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో ‘భూధార్’ తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందన్నారు.

◆ భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వేచేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

◆ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు.

◆ భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందన్నారు.

◆ ఇళ్ల స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

◆ గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందన్నారు.

◆ భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని కలెక్టరు సూచించారు.

◆ ఈనెల 19 నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, ఈ సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై ప్రజలు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, డిప్యూటి కలెక్టర్ వంశీమోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరికరాల అందజేత



సాక్షి, సిటీబ్యూరో : సీఎస్ఆర్‌లో భాగంగా చెన్నైలోని కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) సహకారంతో మేడ్చల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో డెలివరీ బెడ్లు, బేబీ వార్మర్లు, బయోకెమిస్ట్రీ ఎనలైజర్లు, సెల్ కౌంటర్ మెషిన్లు, వైద్య పరికరాలను అందజేశారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరీకి ఈ వైద్య పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) బృందంతో పాటు అదనపు జిల్లా వైద్యాధికారి డా.సత్యవతి, సూపరింటెండెంట్ మహమ్మద్ సలీం, ఎన్‌హెచ్‌ఎమ్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి మంజుల రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం



జవహర్‌నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: వేసవిలో చలివేంద్రాల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గురువారం బాలాజీనగర్‌లోని సాయిబాబాకమాన్ సమీపంలో మాజీ కార్పొరేటర్ జిట్ట శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలని, బీఆర్ఎస్ హయాంలో మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందించామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని దాతలు ముందుకొచ్చి ఉచితంగా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. మాజీ కార్పొరేటర్లు లలితాయాదవ్, సంగీతారాజశేఖర్, సతీష్‌కుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, ఉద్యమకారుల ఫోరం జవహర్‌నగర్ అధ్యక్షుడు సుధాకర్‌చారి, నాయకులు నర్సింహ్మయాదవ్, ప్రసాద్‌గౌడ్, మహేష్, కాశీం, ప్రశాంత్, శోభారెడ్డి, మంజుల తదితరులున్నారు.

తూంకుంటలో అదనపు కలెక్టర్ పర్యటన



అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట వార్డులో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పర్యటించారు. ఈ సందర్భంగా గురువారం శామీర్‌పేట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్, డిప్యూటీ ఈఈ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని..

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్లకార్డులతో ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించాలని మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేడ్చల్, షామీర్‌పేట్, మూడుచింతపల్లి, మండలాల్లోని గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న 5 నెలల జీతం వెంటనే ఇవ్వాలని కోరారు. రోజూవారీ ఖర్చులకు స్కూల్ ఫీజు ఇంటి అద్దె, నిత్యావసరాల సరుకులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గ్రామపంచాయతీ కార్మిక నాయకులు సుధాకర్, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్సీఆర్ఎంయూ) డివిజన్ సెక్రటరీ రవీందర్ అన్నారు. గురువారం ఘట్‌కేసర్, చెర్లపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించి రైల్వే కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైట్ డ్యూటీ పెట్రోల్ మెన్స్‌ను ఇద్దరిని నియమించాలని, రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, చెర్లపల్లి టెర్మినల్‌లో అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఆర్ఎంతో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఘట్‌కేసర్ బ్రాంచ్ మేనేజర్ విజయకుమార్, సికింద్రాబాద్ డివిజన్ కోశాధికారి నర్సింహ్మారెడ్డి, సెక్రటరీ వినయ్, ఘట్‌కేసర్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ దిలీప్‌కుమార్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, ప్రవీణ్‌కుమార్, అశోక్, మల్లేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



ఉద్దమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దెమర్రిలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో నిర్వహిస్తున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉద్దమర్రి నర్సింహ్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. గ్రామంలో ప్రధాన రోడ్లల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, బాలనర్సింహ, గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు విష్ణుగౌడ్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం తూంకుంట మున్సిపాలిటీతో పాటు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వీడియోల ప్రదర్శన, బాధితుల విన్నపాలు, వారి కుటుంబసభ్యుల అనుభవాలను వినిపించడం ద్వారా రోడ్డు నిబంధనలు పాటించకపోతే జరిగే పర్యవసనాలను వివరించారు. విశ్వవిశ్వాని స్కూల్ ఆఫ్ బిజినెస్ ఐఎంబీఏ డైరెక్టర్ మీర్ ఇర్ఫాన్ ఉల్‌హక్, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెక్కీ నిందితుల రిమాండ్

జువైనల్ హోమ్‌కు బాలుడి తరలింపు

ఘట్‌కేసర్: బావమరుదుల ఆస్తికోసం రెక్కీ ఏర్పాటు చేసిన బావ, రెక్కీ నిర్వహించిన నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. అంకుషాపూర్ గ్రామానికి చెందిన బోనాల రాజశేఖర్, బోనాల ఈశ్వర్, వారి బావ కొండాపూర్ మసీదుబండకు చెందిన మేడ్చల్ శ్రీనివాస్, మేడ్చల్ లావణ్య మధ్య కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. బావమరుదుల ఆస్తి కోసం బాబు షేక్ సొహెల్(20), ఎండీ ఇర్ఫాన్(20), సల్మాన్(18), మరో మైనర్ అర్బాజ్ అలియాస్ అబ్బు అంకుషాపూర్‌లో రాజశేఖర్, ఈశ్వర్ కదలికలపై రెక్కీ నిర్వహిస్తుండగా.. గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. బాధితుల తండ్రి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. ప్రధాన నిందితురాలు లావణ్య పరారీలో ఉన్నట్లు సమాచారం. మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తీసుకెళ్లామన్నారు.

మున్సిపల్ నర్సరీ గేటుపై ప్రైవేటు పేరు !



ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పటేల్‌నగర్‌లో ఉన్న మున్సిపల్ నర్సరీ గేటుపై గురువారం రాత్రి ఓ వ్యక్తి తన పేరు, ఫోన్ నంబర్ రాసుకోవడంపై కలకలం రేపింది. గతంలో కూడా ఇదే విధంగా గేటు, నాటిన మొక్కలు తొలగించి మరో చోట గేటు ఏర్పాటు చేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. గతంలో జరిగిన విధంగానే గేటుపై పేరు రాసుకోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా.. అందుబాటులోకి రాలేదు.

మురుగు నివారణకు తగిన చర్యలు



అధికారులతో కలిసి సమస్యను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: గత 30 ఏళ్లుగా కాప్రా, జవహర్‌నగర్ సరిహద్దుల్లో వర్షపునీరు, మురుగు బయటకు వెళ్లకుండా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇక ఆ సమస్యలు రాకుండా చూస్తామని కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. గురువారం జవహర్‌నగర్ డీఈ మాధవచారి, కాప్రా ఏఈ రోహిత్‌లతో కలిసి పాపయ్యనగర్, బీజేఆర్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంతోనే సరిహద్దుల్లో సమస్య ఏర్పడిందన్నారు. బీజేఆర్‌నగర్ సరిహద్దుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని , ప్రస్తుతం పాపయ్యనగర్ నుంచి మురుగు వెళ్లడానికి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

దుకాణ యజమానులపై దాడి చేసిన వారిపై కేసు



నిందితులు రాజశేఖర్, విశాల్

ఘట్‌కేసర్: దుకాణంలో తీసుకున్న ఐస్‌క్రీమ్‌లు ఇంటికి వెళ్లేసరికి కరిగిపోయాయని ఆరోపిస్తూ.. దుకాణం యజమానులపై దాడిచేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన పుప్పరామ్ కుమావత్, శైలు కుమావత్ దంపతులు గత కొంతకాలంగా అవుషాపూర్‌లో కిరాణ దుకాణం నడిపిస్తూ.. జీవనోపాధి పొందుతున్నారు. బుధవారం గ్రామానికి చెందిన మచ్చ జయశ్రీ, పప్పురామ్ కుమావత్ దుకాణానికి వచ్చి రెండు ఐస్‌క్రీమ్‌లు కొనుగోలు చేసింది. ఇంటికి వెళ్లి చూడగా కరిగిపోయాయి. ఈ విషయం ఆమె తన కుమారులు మచ్చ రాజశేఖర్ (రాయల్), విశాల్‌కు చెప్పింది. దీంతో వారు ఆగ్రహంతో దుకాణానికి వెళ్లి పప్పు రామ్‌కుమావత్, శైలు కుమావత్ దంపతులను అసభ్యకరంగా తిడుతూ దాడి చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అఘోరిపై హిజ్రాల ఫిర్యాదు !

కేసు నమోదు చేసిన పోలీసులు



ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న జోగిని సంధ్య

శామీర్‌పేట్: అఘోరిపై చర్యలు తీసుకోవాలంటూ మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో స్థానిక జోగినీలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఘోరిగా చలామణి అవుతూ.. ప్రజలను మోసం చేస్తున్న అఘోరి అలియాస్ శ్రీనివాస్‌పై ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు ఫిర్యాదు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా జోగిని సంధ్య మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరు చెప్పుకుని ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, శివశక్తులు, జోగినిలు, హిజ్రా వ్యవస్థకు చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. అతడు అఘోరి కాదని, అసలు హిజ్రానే కాదన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలో ఆడపిల్లలాగా ఉండి, ఓ ఆడపిల్లను పెళ్లి చేసుకుని తాజాగా వర్షిణి అనే అమ్మాయిని పెళ్లి చేసుకుని హిజ్రాలకు మాయని మచ్చ తెచ్చాడన్నారు. దీంతో అతడి బండారం బయటపడిందని, ప్రభుత్వం, పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం కాపాడాలంటే ఇలాంటి వాళ్లను సమాజం నుంచి తరిమి కొట్టాలని, బయట ఎక్కడా తిరగనివ్వొద్దని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు



పశువులకు టీకా వేస్తున్న వైద్యాధికారి పద్మిని

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి సోకకుండా మండల పశువైద్యాధికారి పద్మిని నివారణ టీకా (ఎఫ్ఎండీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ.. పాడి అభివృద్ధికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీకాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ వ్యాధితో పశువులు బలహీనపడి మృత్యువాత పడతాయన్నారు. మొత్తం 188 పశువులకు టీకా వేశామన్నారు. జూనియర్ పశువైద్యాధికారి నరేందర్‌గౌడ్ రైతులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మాస్టర్ అరుణ్ కార్తీక్



కీసర: 18 దేశాల నుంచి 1,046 మంది సంగీత కారులు కీబోర్డులో సరలీ-స్వరాస్ ఆడటంతో పాటు ఆన్‌లైన్‌లో ఓ గంటలో అప్‌లోడ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో దమ్మాయిగూడకు చెందిన మాస్టర్ అరుణ్ కార్తీక్ బర్త్‌పుడి స్థానం సంపాదించాడు. ఈనెల 14న హైదరాబాద్ మణికొండలోని తన గురువు వేణుగోపాల్ చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, బంగారు పతకాన్ని అందుకున్నారు. గత డిసెంబర్ ఒకటిన హాలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో ఆయన పాల్గొన్నారు. అరుణ్ కార్తీక్ కీసరలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

జవహర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్య తదితరులు

జవహర్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు నాశనమయ్యాయని, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. ఈనెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం జవహర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్‌ల సమక్షంలో చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ ఉట్టిమాటలేనన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో రూ.350 కోట్లతో జవహర్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ఇప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. జీవో 58, 59 పేరుతో జవహర్‌నగర్‌లోని పేదల ఇళ్లను క్రమబద్ధీకరించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్లు సంగీతారాజశేఖర్, శ్రీవాణి, లలితాయాదవ్, సతీష్‌కుమార్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జిట్ట శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌చారి, మహేష్, ప్రసాద్‌గౌడ్, నర్సింహయాదవ్, సిద్ధులు యాదవ్, వెంకటేష్‌గౌడ్, సోమయ్యగౌడ్, మహేందర్ యాదవ్, అహ్మద్‌పాషా, సంధ్య, మంజుల, కేతమ్మ, సాధిక్, మతిన్, సాయి, నవీన్‌గౌడ్, సత్యం, ప్రశాంత్ తదితరులున్నారు.